క్లుప్తంగా

నేడు చిత్తనూర్ నుంచి పాదయాత్ర



మరికల్: ఇథనాల్ కంపెనీ రద్దు కోసం పోరాడుతున్న కంపెనీ వ్యతిరేక పోరాట సమితి కమిటీ సభ్యులు బుధవారం చిత్తనూర్ నుంచి మరికల్ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. తమపైన, దళిత మహిళలపైన పెట్టిన కేసులను ఎత్తివేయాలని యాత్ర చేపడుతున్నామని కమిటీ సభ్యులు మురళీ, రాంచంద్రయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. తమపై దాడులకు దిగిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



మక్తల్: పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉర్దూ మీడియంలో ఎంఐఎం పార్టీ తరపున ఆల్ ఇన్ వన్ బుక్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మీర్జా రహిమత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ ఖాదార్ సాబ్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జహిద్ అలీ తదితరులు ఉన్నారు.

నీటిట్యాంకు నిర్మాణానికి విరాళం

మాగనూర్: హోలీ వేడుకల సందర్భంగా వడ్వాట్ గ్రామంలోని కొందరు యువకులు ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం జరిగిన వేడుకల సందర్భంగా పాల్గొన్నారు. ప్రముఖుల నుంచి రూ. 10 వేలు జమ చేయగా వాటిని గ్రామంలోని శివాలయం ఆవరణలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ పూజారి విశ్వనాథ్‌రెడ్డికి నగదు అందజేశారు.

వీరారెడ్డికి నివాళి



మక్తల్: మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి వర్ధంతిని మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ యువనాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రసదస్సు వాల్‌పోస్టర్ విడుదల



నారాయణపేట టౌన్ : సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం కోటకొండలో నాయకులు ఆవిష్కరించారు. పార్టీ గ్రామ కార్యదర్శి ప్రతాప్, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, ప్రజాపంథా డివిజన్ నాయకులు హాజీమలంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల పరిధిలోని బిజ్వార్‌లో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. డివిజన్ నాయకులు జీ వెంకట్‌రెడ్డి ఉద్యమనేత రవి 7వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.నాయకులు సిద్ధు, రామాంజనేయులు, నరసింహులు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి సమీపంలో వెలసిన వీర భద్రకాళీ మఠం పదో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం భద్రకాళీ వీర భద్రేశ్వర స్వామి కల్యాణోత్సవం భద్రనందా స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు ధరింపజేసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కనులపండుగగా చేశారు. ఉత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు హాజరై తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనందాల హోలీ..



మద్దూర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు, చిన్నారులు



మక్తల్‌లో హోలీ సంబరాల్లో పాల్గొన్న సీఐ సీతయ్య



కృష్ణా మండలం టైరోడ్డులో పోలీసులతో కలిసి వేడుకలు చేసుకుంటున్న యువకులు



ధన్వాడలో..



కోస్గి బీసీ కాలనీలో..

కోస్గి: మండలంలో హోలీ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించుకొన్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొన్నారు. పలు హిందూ సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీసీ కాలనీలో మతాలకతీతంగా యువకులు వేడుకలు జరుపుకొన్నారు. మున్నూర్ వీధికి చెందిన యువకులు ప్రత్యేకంగా వాహనంలో రంగుల డ్రమ్ములతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా సోమవారం రాత్రి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కామ దహనం చేశారు.

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాలలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత రోడ్ల పైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ధన్వాడ మారుతీనగర్‌లో పాలఉట్టి కొట్టారు.

మద్దూరు: మండలంలో హోలీ సంబరాలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో వివిధ పార్టీ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం రాత్రి మద్దూరు చౌడేశ్వరీ దేవాలయం, కాచువాగు శివాలయం, మేట్ల గేరి, పాండురంగ దేవాలయం దగ్గర కామదహనం చేశారు.

ఊట్కూరు: మండలంలోని ఊట్కూరు, మల్లెపల్లి, పులిమామిడి, చిన్నపొర్ల, బిజ్వార్, పెద్దజట్రం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఊట్కూరులోని పాతపేట వీధిలో సోమవారం అర్ధరాత్రి కామదహనం చేశారు.

మాగనూర్: మండలంలోని వర్కూర్, కొత్తపల్లి, గురవలింగంపల్లి, నేరడగం, మాగనూర్, వాడ్వట్, కొల్పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం హోలీ వేడుకలు నిర్వహించారు.

మక్తల్: పట్టణంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, వీజేఆర్ అధినేత వర్కట జగన్నాథ్ రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఐ సీతయ్య, ఎస్ఐ పర్వతాలు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: పెద్దకడ్మూర్, నర్వ ఉందేకోడ్, పాథర్చేడ్, రాయికోడ్, లంకాల్, రాంపురం, కుమార్‌లింగంపల్లి, బెక్కర్‌పల్లి తదితర గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. ఎస్ఐ విక్రమ్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు.

మరికల్: మండలంలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంతో పాటూ ముడుమాల్, మురహర్‌దొడ్డి, హిందూపూర్, కున్సి గ్రామాల్లో మంగళవారం వేడుకలు నిర్వహించారు. కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..



ఎస్పీ వెంకటేశ్వర్లుకు రంగు పూసి, శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట టౌన్: జిల్లాలో హోలీ సంబరాలు మంగళవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. డీజే పాటలు, డప్పుచప్పుళ్లకు నృత్యాలు చేస్తూ యువత రంగులు చల్లుకున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు, వ్యాపారులు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ వెంకటేశ్వర్లుకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగులు పూసి, స్వీట్ తినిపించారు. అలాగే బీజేపీ, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు తమ తమ ప్రాంతాల్లోనే గ్రూపులుగా రంగోలి సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, కన్న జగదీష్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగురావు నామాజీని కలసి హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బార్‌అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నందునామాజీ, కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్, న్యాయవాదులు సత్యయాదవ్, విజయ్ నామాజీ, నర్సిములు, సతీష్‌గౌడ్, చెన్నారెడ్డి, నారాయణ, కుర్మన్న గౌడ్, నర్సిములు యాదవ్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్లప్ప



హోలీ సంబరాల్లో వర్కటం జగన్నాథ్‌రెడ్డి



మాగనూర్‌లో..



బీజేపీ నాయకుడు నాగురావు నామాజీకి శుభాకాంక్షలు చెబుతున్న న్యాయవాదులు



కోస్గిలో..



మరికల్‌లో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖతో గ్రామస్తులు



మల్లెపల్లిలో..



సింగార్‌బేస్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

కల్యాణోత్సవానికి తరలిన భక్తులు

మరికల్: మన్యంకొండలో జరిగే అలివేలు మంగమ్మ కల్యాణోత్సవ వేడుకలకు పల్లెగడ్డ శ్రీవారి భక్తులతో పాటు మూడు భజన మండలి కమిటీ సభ్యులు మంగళవారం పాదయాత్రగా భజనలు చేసుకుంటూ తరలివెళ్లారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి తెల్లవారుజామున్న యాత్ర ప్రారంభించారు. కల్యాణోత్సవంలో పాల్గొని భజన సంకీర్తనలు ఆలపించనున్నట్లు వివరించారు.



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పునరావాసం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మక్తల్: అంకెన్‌పల్లిని జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామంగా ప్రకటించి 15ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పునరావాసం కల్పించలేదని సర్పంచ్ లక్ష్మన్న అన్నారు. పునరావాసం కల్పించాలని మంగళవారం ఏఓ నర్సింగ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నంబర్ 1050 ద్వారా 2007లో అంకెన్ పల్లిని ముంపు గ్రామంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే పునరావాసం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ నగర్‌లో తాగునీటి సమస్య

మరికల్: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఐదు రోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడింది. నీరు అందించే పంచాయతీ బోరు మోటారుకు సంబంధించిన కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో నీటి సమస్య వేధిస్తోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీళ్ల కోసం ఇతర కాలనీలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

10న రాష్ట్ర సదస్సు

నారాయణపేట టౌన్ : సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని మండల కార్యదర్శి నర్సింహులు, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలు పెరుగుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయన్నారు. నాయకులు కెంచి నారాయణ, లాలు, నరసింహా, అరుణోదయ రాష్ట్ర నాయకులు అంజి, మహబూబ్‌నగర్ జిల్లా పీడీఎస్ యూ అధ్యక్షులు మారుతి, కృష్ణ పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సాయివిజయ్ కాలనీలో వెలసిన శ్రీ షిర్డీ సాయి హనుమాన్ మందిరంలో పౌర్ణమి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, పుష్పాలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

‘పట్టా’లకే పరిమితం

- ప్లాట్ల పంపిణీ మరిచిన వైనం
- 5 గ్రామాల్లో లబ్ధిదారుల ఎదురుచూపులు



మొగ్దుంపూర్‌లో ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమి



తిప్రాస్‌పల్లిలో ఇళ్ల స్థలాల్లో పెరిగిన ముళ్లపొదలు



ఓ లబ్ధిదారుడి పట్టా

ఊట్కూర్: దేవుడు వరమిచ్చినా.... పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది మండలంలో పలుగ్రామాల్లో ప్లాట్ల పింపిణీ. ప్రభుత్వం గతంలో ఇళ్లు లేని పేదలకు స్థలాలకు సంబంధించిన పట్టాలు ఇచ్చినా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ హద్దులు చూపి ప్లాట్లు పంపిణీ చేయలేదు. దీంతో కొనేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. తప్పనిసరి పరిస్థితులలో కిరాయి ఇళ్లలో, అక్కడక్కడా గుడిసెలు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో నిరుపేదల కోసం కొనుగోలు చేసిన భూముల్లో ముళ్ళపొదలు పెరిగాయి. మండలంలోని పెద్దజట్రం, పగిడిమర్రి, మొగ్దుంపూర్, తిప్రాస్‌పల్లి, ఊట్కూర్ తదితర గ్రామాల్లో గత 30 ఏళ్ల క్రితం నిరుపేదలకు ఇవ్వడం కోసం భూములు కొనుగోలు చేశారు. లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. కానీ ప్లాట్లు మాత్రం పంచలేదు. విషయమై పలు మార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పెద్దజట్రం గ్రామంలో సర్వే నెం. 823లో 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 78 నిరుపేదలకు పట్టాలు ఇచ్చారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదు.

మొగ్దుంపూర్ గ్రామ శివారులో 2007 లో సర్వే నెం. 576/ఏ లో 2 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 45 మందికి పట్టాలు ఇచ్చారు.

ఊట్కూర్‌లో... శ్రీరాంనగర్ పాఠశాల ప్రక్కన 1977 లో అప్పటి ప్రభుత్వం సర్వే నెం. 845, 847 లలో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసింది. 50 మందికి పట్టాలను అందించారు. అబ్ధిదారులు హద్దులు చూయించాలని ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

తిప్రాస్‌పల్లిలో నూతన గ్రామం ఏర్పాటు కోసం 1971, 1979, 1985లో విడతల వారీగా భూమిని కొనుగోలు చేశారు. 283 మంది లబ్ధిదారులకు పట్టాలను అందించారు. వీరిలో 251 మందికి హద్దులు చూయించారు. ఇంకా 32 మందికి హద్దులు చూయించాల్సి ఉంది.

న్యాయం చేయాలి

ప్రభుత్వం మండలంలో ఊట్కూర్, పగిడిమర్రి, పెద్దజట్రం తదితర గ్రామాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. ఇప్పటివరకు సర్వే చేపట్టి స్థలాలు లబ్ధిదారులకు కేటాయించ లేదు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి. లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలి.

– కే నారాయణ, ఊట్కూర్

స్థలాలు కేటాయించాలి

గ్రామ శివారులో 78 మంది నిరుపేదలకు 2006లో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదు. పలు మార్లు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేపట్టి స్థలాలు కేటాయించాలి

– కిరణ్ కుమార్, ఎంపీటీసీ, పెద్దజట్రం

చిన్నారులకు క్రీడా పోటీలు

మక్తల్: వల్లాభాపురం దత్తక్షేత్రంలో నారాయణపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించారు. అదేవిధంగా సినీ ఆర్టిస్టుల సమక్షంలో డ్యాన్స్‌లు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాస్తారోకో

కృష్ణా: మండలానికి చెందిన ఓ పత్రికా విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ జిల్లా కార్యదర్శి జీవన్, మండల అధ్యక్షుడు జగన్నాథ్, ప్రధాన కార్యదర్శిఅశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.